క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



తిరుమలగిరిలో ప్రింటర్‌ను బహూకరిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పేరం కుమార్, షీల మల్లేష్‌లు రూ.12500 విలువైన వైఫై ప్రింటర్‌ను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడికి నివాళి



కుమ్మరిగూడెంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి : మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ ఆవాసం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పిట్టల సైదులు శుక్రవారం మృతిచెందారు. దీంతో అతడి మృతదేహాన్ని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఉపసర్పంచ్ శనిగారపు సుశీలసత్తయ్య, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పిట్టల నర్సయ్య, రైతు బంధు సమితి కోఆర్డినేటర్ గుండె ఈశ్వర్, తొట్ల శ్రీను, అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, పిట్టల వెంకన్న, మన్నె శివ తదితరులు ఉన్నారు.

ధాన్యం మొలకెత్తి తీవ్ర నష్టం



మొలకెత్తిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

అర్వపల్లి : అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. అలాగే 365, 365బీ హైవేలపై రైతులు పోసిపెట్టిన ధాన్యం తడిసింది. కొన్ని చోట్ల తడిసిన ధాన్యం మొలకెత్తుతుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు మండల పరిధిలోని సూర్యాపేట– జనగామ హైవేపై వేల్పుచర్ల స్టేజీవద్ద వంద మీటర్ల పొడవున రోడ్డుకిరువైపులా ఆరబోశారు.

కాంగ్రెస్ పార్టీదే గెలుపు

కోదాడరూరల్ : కోదాడలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారిలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోదాడ మండలంలో 5వేల పైచిలుకు మెజార్టీ తమ పార్టీకి వస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమయానికి హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

అనంతగిరి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పద్మావతిరెడ్డి నాయకత్వాన్ని కోరుకున్న ప్రజలు తమ అభిమానాన్ని పోలింగ్ రూపంలో తెలిపినట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి మృతి

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి (55) అకాల మరణం చెందారు. శుక్రవారం తెల్లవారుజామున ఆయన శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా స్థానికంగా చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఎవరి లెక్కలు వారివే !

- కూడికలు, తీసివేతల్లో పార్టీల శ్రేణులు
- తుంగతుర్తి నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిన పోలింగ్
- 3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



గాదరి కిషోర్‌కుమార్



మందుల సామేల్

తిరుమలగిరి : పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు తెలుసుకోవడంతో పాటు తమకు ఎంత మేర ఓట్లు పడతాయనే దానిపై అనుచరుల నుంచి, నిఘా విభాగం అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. పోలింగ్ ముగియగానే బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ముఖ్య అనుచరులతో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్నారు. ఎవ్వరు గెలుస్తారు ? విజయ అవకాశాలు ఎలా ఉన్నాయి ? అనే అంచనాల్లో మునిగి తేలుతున్నారు. భారీగా పోలైన ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలు వేస్తున్నారు. గెలుపు, ఓటముల విషయంలో బేరీజు వేసుకుంటున్నారు. ఓ వైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా లోపల మాత్రం ఈ నెల 3వ తేదీన వెలువడే ఫలితాలపై ఆశలు పెంచుకున్నారు. మరో వైపు టీవీల్లో, సోషల్ మీడియాల్లో వచ్చిన ఎగ్జిట్ పోల్స్ కొంత మందిలో ఆశలు నింపగా మరికొందరు అభ్యర్థులను నిరాశకు గురి చేస్తున్నాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా..

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏ పోలింగ్ కేంద్రంలో తమ పార్టీకి మద్దతు లభించిందనే వివరాలను సేకరిస్తున్నారు. ఇలా నియోజకవర్గం మొత్తం పోలైన ఓట్లలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయో లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీ గెలుపు కోసం ఎవ్వరు పని చేశారు, ఎవ్వరు వ్యతిరేకంగా పని చేశారనే వివరాలను సైతం తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా, గ్రామాల్లో ఎక్కడ ఇద్దరు గుమికూడినా, ఏ నాయకుడిని పలకరించినా ఎవ్వరు గెలుస్తారనే చర్చనే విపరీతంగా జరుగుతుంది. ఫోన్‌లలో స్నేహితులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపు ఓటములపై ఆరా తీయడం కనిపిస్తుంది. ఏ వర్గం వారు తమకు అనుకూలంగా ఓటు వేసే అవకాశం ఉందని తెలుసుకుంటూనే ఎవ్వరు ప్రతికూలంగా వ్యవహరించారనే విషయాలపై అనుచరులతో ముఖ్య నాయకులు చర్చిస్తున్నారు. ఫలితాల తీరుపై అంచనాలను రూపొందిస్తున్నారు.

ఎవరి ధీమా వారిదే..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపు మీద ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గాదరి కిషోర్ గత పది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో లబ్ధిదారులు తమకు మద్దతు పలికినట్లు బీఆర్‌ఎస్ నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ స్థానికత, ఈ ప్రాంతంలో తెలంగాణ సాధన కోసం చేసిన పోరాటం, కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, ప్రభుత్వ వ్యతిరేకతతో తాము గెలుస్తామనే విశ్వాసంతో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను అభ్యర్థులు విశ్లేషించుకుంటున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపడుతుందో అనే దానిపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతుంది. ఆయా పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీనే రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 3వ తేదీ ఫలితాల దాక వేచి చూద్దామని చెబుతూనే పార్టీ శ్రేణుల్లో ఆశావాద దృక్పథాన్ని పెంచుతున్నారు.

ఎప్పుడూ లేనంతగా 87.64శాతం..

తుంగతుర్తి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా 87.64 శాతం పోలింగ్ నమోదైంది. భారీగా పోలింగ్ నమోదవడంతో ప్రధాన పార్టీల నాయకులు తమకే విజయావకాశాలు ఉంటున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో పార్టీల వారిగా వచ్చిన ఓట్లను పరిగణలోకి తీసుకుంటూనే ఈసారి ఏ గ్రామాలు, ఏ బూత్‌లలో ఎవ్వరికి ఓట్లు పెరిగాయి, తగ్గాయనే విశ్లేషణలు చేసుకుంటున్నారు.

ఎప్పుడూ ఉత్కంఠే..

తుంగతుర్తి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ ఉత్కంఠనే నెలకొల్పుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు గాదరి కిషోర్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అద్దంకి దయాకర్‌పై 2379 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అద్దంకి దయాకర్‌పై 1847 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గతంలో రెండుసార్లు కూడా స్వల్ప మెజార్టీతో విజయం సాధించడంతో ఎప్పుడూ విజయంపై ఉత్కంఠే నెలకొంటుంది. నియోజకవర్గంలో ఈసారి భారీగా పోలింగ్ నమోదవడంతో ఏ పార్టీ అభ్యర్థిని విజయం వరించనున్నదో మరో కొన్ని గంటలు గడిస్తే తేలనున్నది. అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై గ్రామాల్లో జోరుగా బెట్టింగులు సైతం జరుగుతున్నాయి.

గెలుపు ధీమాలో అభ్యర్థులు



సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సూర్యాపేట నియోకవర్గంలో పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉన్నారు. ఏయే వార్డుల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లు వస్తాయోనని వారి అనుచరులతో మీటింగ్‌లు పెట్టుకుని లెక్కలు సేకరిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎవరెవరికి ఎక్కడెక్కడ ఎన్ని ఓట్లు వచ్చాయి.. ప్రస్తుతం ఎన్ని వస్తాయి అని అంచనాలు వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందని.. అధికార పార్టీ వ్యతిరేకత తమకు కలిసివస్తుందని కాంగ్రెస్ ధీమాతో ఉండగా.. అధికార పార్టీ మాత్రం తాము చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని భావిస్తోంది. బీజేపీ అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు ఒక్కసారి అవకాశమివ్వాలని కోరడం ప్రజలను ఆలోచించి తమకే ఓటు వేసేలా చేసిందని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. బీఎస్పీ అభ్యర్థి బడుగు, బలహీన వర్గాలంతా తమ వైపే ఉన్నారని, గెలుస్తాననే ధీమాలో ఉన్నారు.

డబ్బు పంపిణీనే గెలిపిస్తుందా..?

ఎన్నికల్లో ప్రధానంగా డబ్బు పంపిణీయే అభ్యర్థులను గెలుపిస్తుందని జోరుగా చర్చజరుగుతోంది. డబ్బు పంపిణీ చేయలేదని, చేయకున్నా తామే గెలుస్తామని ఆయా పార్టీల అభ్యర్థులు అంటున్నప్పటికీ అందరూ డబ్బు పంపిణీ చేసినట్లు జోరుగా చర్చ నడుస్తోంది. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి సుమారు 1.40 లక్షల మంది ఓటర్లకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం సాగుతుంది. మరో అభ్యర్థి కూడా అంతకు రెట్టింపు స్థాయిలో డబ్బు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారని, కానీ వారి అనుచరులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి. పలు వార్డుల్లో ఓటర్లు డబ్బుల కోసం ఘర్షణలకు దిగినట్లు సమాచారం. మరో ప్రధాన పార్టీ అభ్యర్థి డబ్బు సర్దుబాటు కాకనో.. లేదా గెలుపు ధీమాతోనో కేవలం ఓటుకు రూ.500 మాత్రమే పంపిణీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో అభ్యర్థి కూడా ఓటర్లందరికీ కాకుండా మాస్ ప్రాంతాల్లో రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ డబ్బు పంపిణీ ధీమాతోనో లేక వారి వారి వ్యక్తిగత ఎజెండాతోనో అభ్యర్థులంతా ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉన్నారు.

ఆత్మకూరు మండలంలో 90.11 శాతం పోలింగ్



అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 90.11శాతం పోలింగ్ నమోదైంది. ఇంత పెద్ద మొత్తంలో ఓటింగ్ నమోదు కావడంతో ఎవరికి లాభం చేకూరుతుందోననే ఆలోచనలో రాజకీయ నాయకులు ఉన్నారు. మండల వ్యాప్తంగా 42,685 మంది ఓటర్లు ఉండగా 38,465 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఓటర్లను ఆకర్షించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ చివరకు ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారనేది అర్థం కావడం లేదు. అధికార బీఆర్‌ఎస్ అభివృద్ధి మంత్రం ఫలిస్తుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వ వ్యతిరేకత పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. బీజేపీ మాత్రం అభ్యర్థి వ్యక్తిత్వం, కేంద్ర ప్రభుత్వ పథకాలు ఫలించి ఓటర్లను భారీగానే ఆకట్టుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎవరికి వాళ్లే లెక్కలేసుకుంటున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో 89.60 శాతం

అర్వపల్లి : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జాజిరెడ్డిగూడెం మండలంలో తుంగతుర్తి నియోజకవర్గంలోనే అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 32 పోలింగ్ కేంద్రాలుండగా వీటి పరిధిలో 23,826 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 21,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం 89.60గా నమోదైంది.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి



తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తుంగతుర్తి : ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ చందనాయక్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సోమన్న, నర్సింహాచారి, జానకమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో ర్యాలీ..

నూతనకల్ : ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి కోరారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ తారమ్మ, సూపర్‌వైజర్లు మాణిక్యం, చిన్ని, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సరదాగా సంకినేని

- కుటుంబ సభ్యులతో హోటల్ సెవెన్‌లో గడిపిన వెంకటేశ్వరరావు

సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నవంబర్ 3 నుంచి ఎన్నికలు జరిగిన నవంబర్ 30 వరకు ప్రచారంలో బిజీబిజీగా గడిపిన సూర్యాపేట బీజేపీ అభ్యర్థి వెంకటేశ్వరరావు శుక్రవారం కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఆయన గెలుపే లక్ష్యంగా సూర్యాపేట నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన కుటుంబ సభ్యులు హోటల్ సెవెన్‌లో సేదతీరారు. ఈ సందర్భంగా సంకినేని వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రచారంలో తనతోపాటు తన కుటుంబ సభ్యులు కూడా ఎంతో శ్రమించారని తెలిపారు. తనకు ఎలాంటి పదవులు లేకున్నా కార్యకర్తలు తన వెంటే ఉండి పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషిచేశారని అన్నారు. ఇతర పార్టీల ప్రలోభాలకు గురికాకుండా అండగా నిలిచారని కార్యకర్తలను కొనియాడారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ

హుజూర్‌నగర్ : కార్తీక మాసం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ, కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పడిపూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ధర్మకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొన్న భక్తులు

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



అర్వపల్లిలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో పోరాడి ప్రాణాలర్పించిన అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీఎస్ జేఏసీ–ఓయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నోముల వంశీయాదవ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని శుక్రవారం అర్వపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం కిష్టయ్య చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దడిపల్లి వెంకట్, దిర్శనపు కృష్ణమూర్తి, పుప్పాల సోమశేఖర్, మర్రిపల్లి సూర్య, మామిడి సోమయ్య, కనుకు మహేష్, అలువాల వెంకటస్వామి, మామిడి శ్రీను, బైరబోయిన మహారాజు, కొమారి శ్రీరాములు, దిర్శనపు యాదయ్య, కొమారి సురేష్, శివ, నాగరాజు, మామిడి సురేష్, కుంభం రాజు, సాయిని మణి, కోటిప్రసాద్, రాంగోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సీజన్ పనులు షురూ..

- జాజిరెడ్డిగూడెం మండలంలో 21 వేల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా
- ప్రారంభంలోనే గోదావరి జలాలను విడుదల చేయాలని రైతుల వినతి



అర్వపల్లి శివారులో..

అర్వపల్లి : యాసంగి సీజన్ వ్యవసాయ పనులు మొదలయ్యాయి. కాగా ఓవైపు వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి కోతల పనులు చివరి దశకు చేరాయి. అలాగే వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం అమ్మకాలు పూర్తి కావొస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు ఇప్పటివరకు 75 శాతం మేర పూర్తయ్యాయి. అయితే యాసంగి సీజనల్‌కు సంబంధించి రైతులు ముందుగానే వ్యవసాయ పనులను ప్రారంభించారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా పొలాలు దున్నే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్నేళ్లుగా గోదావరి జలాలతో పంటల సాగు పెరిగింది. ఈసారి కూడా గోదావరి జలాలపై ఆధారపడే రైతులు పూర్తిస్థాయిలో పంటల సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

రైతులు బిజీ బిజీ..

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ యాసంగి సీజన్‌కు గాను 21 వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి జలాల రాకతో పంటల సాగు పెరిగింది. ఓ పక్క వరి కోతలు, ధాన్యం అమ్మకాలు.. మరోవైపు యాసంగి సీజన్ వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి ముందుగానే గోదావరి జలాలను విడుదల చేస్తే పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నదాతలు నీటిపారుదల శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోదావరి జలాలను విడుదల చేయాలి



ఈ యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభించాం. గోదావరి జలాలను వెంటనే విడుదల చేస్తే వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తాం. నేను వ్యవసాయం పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి చేస్తున్నాను.

– గుంటి రవి, రైతు, బొల్లంపల్లి

నీటి విడుదలపై త్వరలో నిర్ణయం



యాసంగి సీజన్‌కు సంబంధించి గోదావరి జలాల విడుదలపై రాష్ట్ర స్థాయిలో ఈనెలలో సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ అధికారులు చర్చించి షెడ్యూల్ ప్రకటించనున్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల జరుగనుంది.

– సత్యనారాయణ, నీటి పారుదల శాఖ డీఈఈ

ఆయిల్‌పామ్ వైపు అడుగులు

- క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : మండలంలోని రైతులు సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కొత్త పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు వాణిజ్య పంట పత్తికే అధిక ప్రాధాన్యం ఇచ్చిన రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఉద్యానవన అధికారులు ఆయిల్‌పామ్ సాగుపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి.

పెరిగిన సాగు విస్తీర్ణం...

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానవన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 256 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల సాగు చేపట్టారు. అధికారుల కృషితో ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. పంట సాగు చేసిన నాలుగేళ్ల పాటు అంతర పంటలుగా కంది, కూరగాయల సాగు, పత్తి, మల్బరు పంటలను సైతం సాగు చేసుకోవచ్చని, ఎర్రనేలలు సాగుకు అనుకూలం కాగా నల్లనేలల్లో సైతం పెంచుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నాలుగేళ్లకే దిగుబడి..

ఆయిల్ పామ్ పంట నాలుగేళ్లకే దిగుబడి వస్తుంది. ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు నర్సరీలో పెరిగిన మొక్కలను రైతులకు అందజేస్తుండగా రైతు తన పొలంలో నాటిన మూడేళ్లలో దిగుబడి ప్రారంభమవుతుంది. ఏడాది పొడవునా, 30 సంవత్సరాల పాటు దిగుబడి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం టన్నుకు రూ. 12,196 ధర ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ధర నిర్ణయిస్తుండటంతో దళారుల ప్రమేయానికి ఎక్కడా ఆస్కారం లేదు.



సింగారెడ్డిపాలెంలో ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా సాగవుతున్న కంది

ప్రభుత్వ ప్రోత్సాహం..

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఒక మొక్క ఖరీదు రూ.193 కాగా ఎకరానికి 57 మొక్కలు నాటాల్సి ఉంటుంది. అయితే రైతులు ఒక్కో మొక్కకు రూ.20 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. నాలుగేళ్ల పాటు ప్రతి ఏడాదికి ఎకరానికి రూ.4200 చొప్పున అందజేస్తుంది. దీనిలో మొక్కల సంరక్షణ కోసం రూ. 2100, అంతర పంటల సాగు కోసం మరో రూ. 2100 చెల్లిస్తుంది. డ్రిప్ పరికరాలను సైతం సబ్సిడీపైనే అందిస్తుంది.

మూడు ఎకరాల్లో సాగు



మాకున్న మూడు ఎకరాల భూమిలో వరి పంటను సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం ఆయిల్‌పామ్ చెట్లు పెట్టిన. నాలుగు నెలల క్రితం నాటగా అంతర పంటగా చిక్కుడు, బీరు, టమాట పంటలను సాగు చేస్తున్నాం. మరో రెండేళ్లలో దిగుబడి ప్రారంభమవుతుంది.

– రంగినేని శ్రీధర్‌రావు, రైతు, సింగారెడ్డిపాలెం

మంచి లాభాలు



ఇతర పంటల సాగుతో పోల్చితే ఆయిల్‌పామ్ సాగులో రైతులకు మంచి లాభాలు ఉంటాయి. నాలుగేళ్లకే దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు వస్తుంది. అంతర పంటలను సైతం సాగు చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం టన్నుకు రూ.12,196ధర పలుకుతోంది.

– కన్నా జగన్, ఉద్యానవన అధికారి, సూర్యాపేట డివిజన్

గెలుపోటములపై జోరుగా పందేలు

హుజూర్‌నగర్ : అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ముగిసింది. దీంతో వివిధ పార్టీల నాయకులు గెలుపు ఓటములపై చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు, టీ స్టాళ్లు తదితర రద్దీ ప్రాంతాలతో పాటు నలుగురు కూడిన చోటే కాకుండా ఎక్కడ చూసినా ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తోంది. కొందరు ఒకడుగు ముందుకేసి జోరుగా పందేలు కాస్తున్నారు. నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో మా పార్టీ గెలుస్తది అంటే... మా పార్టీ గెలుస్తుంది.. అని పలువురు పందెంరాయుళ్లు పందేలకు పోతున్నారు. ఒక్కొక్కరూ వారి వారి ఆర్థిక స్థోమతను బట్టి పందెం కాస్తున్నారు. రూ 10 వేల నుంచి లక్షల్లో పందేలు కాస్తున్నారు. మరి కొందరు స్థోమతకు మించి పందేలకు దిగుతున్నారు. వ్యవసాయదారులు అయితే ఎకరాల చొప్పున పొలాలను పందెంలో ఒడ్డుతున్నారు. గతంలో చేసిన అభివృద్ధి వల్ల మా అభ్యర్థి గెలుస్తాడని ఒకరంటే, మా పార్టీ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని.. అందుకే ప్రజలు మా పార్టీని గెలిపిస్తారని మరొకరు వాదించుకుంటున్నారు. దీనిపై ఎవరికి వారు తగ్గేదేలే అంటూ జోరుగా పందేలకు దిగుతున్నారు. తమకు అనుకూలమైన, నమ్మకమైన వక్తులను మధ్యవర్తులుగా పెట్టుకుని పందేలకు సై అంటున్నారు. చివరికి గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియాలంటే ఈనెల 3 వరకు వేచి చూడాల్సిందే.

సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

కోదాడ : కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు గురువారం జరిగిన ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి తాను ఎంతో రుణపడి ఉంటానని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులతో పాటు, టీడీపీ, సీపీఐ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులకు ముఖ్యంగా మహిళలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కోదాడ నియోజకవర్గంలో అందరి సహకారంతో తాను అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరువేస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వంగవేటి రామారావు, ఈదుల కృష్ణయ్య, బజ్జూరి వెంకటరెడ్డి, కీసర సంతోష్‌రెడ్డి, బూత్కూరి వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

ఆప్యాయత చూపిన ఓటర్లకు కృతజ్ఞతలు

- హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి లక్ష్మి

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆప్యాయత అనురాగాలు చూపిన నియోజకవర్గ ఓటర్లకు అభినందనలు, కృతజ్ఞతలు అని సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని సీపీఎం జిల్లా, మండల, పట్టణ, గ్రామ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు ఎంతో కష్టపడి గత 20 రోజులుగా తన విజయం కోసం కృషి చేశారని, వారందరికీ కృతజ్ఞతలు అని తెలిపారు. అంతేకాకుండా తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాండు, యాదగిరిరావు, శేఖర్‌రావు, పల్లె వెంకటరెడ్డి, అనంత ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు శుక్రవారం ఉపాధ్యాయుడు కారుమంచి శ్రీనివాసరావు, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదానంలో 500 మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాస్‌నాయుడు, గడ్డం సూర్యారెడ్డి, బర్మావత్ సీతారాంసింగ్, రంగా, నాగరాజు ఉన్నారు.